# ఫోటోగ్రాఫు

శ్రీమతి రత్నావళిగారు

౧

"ప్రభా!" అని పిలిచాడు ప్రసాదరావు సావిట్లో బూట్లువిప్పుతూ. ప్రభావతి లోపల 'రొంకిపాటలు' పాడుకుంటోంది సన్నని గొంతుకతో. ప్రసాదరావప్పుడే వచ్చాడు కాలేజీనించి. ప్రభావతి నవ్వుతూ యెదురుగావచ్చింది పాటలుపాడుతూ.

సల్లన్ని యెన్నెట్లో సాపేసికూకుంటె
ఒట్టిమ్మి నావోళ్లు ఉలికులికిపడతాది
నన్నిడిసి పెట్టెల్లినాడే
నారాజు
నిన్న తిరిగొస్తనన్నాడే.

"ఓహో రాణీగారు, ఉషారుగా ఉన్నారీవేళ. సిద్ధంగా ఉండాలి. బలరామ్ 'కెమేరా' పట్టుకొస్తున్నాడు. తప్పదింక."

"అబ్బ! పోనిస్తురూ, ఫోటోలు గీటోలూను. రోజూ యిదే తగాదా. నేనేమో పల్లెటూరుదాన్ని. నాగరికతాలక్షణా లింకా పట్టుపడలేదు. నేర్చుకొంటున్నా నొక్కొక్కటే. కష్టపడి నేర్పారు రొంకిపాటలని. అవి పాడుకుంటున్నా నిప్పుడే."

ప్రభా! యెల్లాగ నేర్చుకోకపోతే? నేనేమో బి.యే., యల్.టి. ప్యాసయ్యానాయె. కాస్తో కూస్తో ఉద్యోగం చేస్తున్నాను కాలేజీలో. కొంచెం సాగ పరిచని పెళ్లాడాను పల్లెటూరిదానినైనా. కొంచెం తెలుగు చదవడం నేర్చుకున్నావు నీ పుణ్యమా అంటూను. చూడు నీచేత యిల్లాటి ఇంగ్లీషు పేపర్లు కూడా చదివించకపోతే కొన్ని నెల్లలో" అని చేతిలో 'హిందూ' పేపరు పడేశాడు.

ప్రభావతి కాగితాలు తిరగేస్తోంది. చూస్తూ చూస్తూ "ఇదేమిటండోయ్, వీళ్లేవళ్లు!" అని ఒక ఫోటో చూపించింది.

"ఆయన ఒక పెద్దఉద్యోగస్థుడు. ఆవిడ ఆయన భార్య" అన్నాడు ప్రసాదరావు.

"వీళ్లు దీనిమీద కెల్లాగొచ్చారు."

"వాళ్లు ఫోటో తియ్యించుకుని పేపరుకి పంపారు."

"ఇదేమిటి, సిగ్గులేదు? మొగుడు పక్కనినుంచుంటే తను కూచుందేం కుర్చీమీద మొద్దులాగ? ఇదేమిటి ఫోటో ఫోటో అంటున్నారు రోజూ? నాకొద్దు బాబూ అయితే ఫోటో."

ప్రసాదరావుకి నవ్వొచ్చింది.

౨

"ప్రభా! నాకు కాలేజీ టైమయిపోతుంది. చప్పున రావాలి."

"ఇదిగో ఇంక రెండే అట్లున్నాయి. కొంచెం ముదురుగా ఉన్నాయండీ.

ఇంకా లేతవొదలుండవు మార్కెట్టులో?"

"ఉండకేం, Trade Deppression."

"అంటే."

"వర్తకమాంద్యం."

"రెండు సమానంగానే తెలిశాయి లెండి."

"ఓహోహో! ఇలా చూడు!"

"అబ్బ చాల్లెద్దురూ! మాబాగా అయిందిలెండి. ఆ మీసాలనిండా కాటికే."

"సరేగాని ఫోటో మాటేం చెప్పావు? నిన్న వృధాగా తిరిగిపోయాడు బలరామ్. బండి అద్దె దండుగ మనకి."

"ఫోటోగ్రాఫా! అలా అయితే తియ్యించుకోను బాబూ. బొత్తుగా సిగ్గులేకుండానా?"

"అలా ఒద్దులే. నే చెపుతాగా! యేం ప్రభా?"

"ఏదో ఆలోచిస్తాను గాదూ."

"అదిగదీ దారి!" గుమ్మందాటాడు.

3

"ప్రభా!"

"యేమండీ."

"పాకం వొచ్చిందా?"

"మెల్లిగా అడుగుదురూ? యెవరేనా వింటే నవ్వుతారు."

"ఎందుకు నవ్వుతారు? ఏమేనా అక్షరాలు గుర్తుపడుతున్నావా?"

"ఓ! పేపర్లో Headingలు కూడపలుక్కుంటు న్నాను."

"ఇంకేం, మరి ఫోటో మాట."

"అబ్బ, సరే అలాగే లెండి. కాని పేపర్లో ఫోటోలాగమాత్రం నే తియ్యించుకోను."

"అలావొద్దులే. రమ్మన్నా బలరామ్‌ని ఈవేళ?"

"సరే లెండి."

"ఆల్ రైట్! ఏదీ............"

"యేమిటండీ."

౪

"బలరామ్! యెలాగోయ్ తియ్యడం ఫోటో? మాఆవిడ నేచెపితే నమ్మడంలేదు." ప్రసాదరావు సంజ్ఞచేశాడు.

"నిజమేనండమ్మా. ఈ కెమరా ఈ చట్రంమీద నుంచి తీసేటప్పుడే ఫోటో పడుతుందండి" అన్నాడు బలరామ్.

ప్రభావతీ ప్రసాదులు డ్రెస్సయ్యారు నీటుగా. పల్లెటూరు భార్యను 'ఫార్సీలేడి'ని చేశాడు ప్రసాదరావు.

బలరామ్ కెమరా అమర్చాడు. కుర్చీఒక్కటే ఉంది.

"ప్రభా! కూర్చో!" అన్నాడు ప్రసాదు.

"అబ్బా, నాకు తెలుసుగా మీరెంతో్తులు. నే కూచోను."

"అదికాదు. ఇప్పుడు బొమ్మ పడదుకామా? నేనూ కూచుంటాను యేదోయ్, వీరాస్వామీ కుర్చీ?"

ప్రభావతి చీరసద్దుకుని కూచుంది కుర్చీలో. ప్రసాదరావు చిరునవ్వుతో నించున్నాడు కుర్చీపట్టుకొని. బలరామ్ తెలియకుండా నవ్వుతున్నాడు. 'కెమెరా' స్వయంగా నే expose చేసుకుంది. అది Automatic self-exposer.

వీరాస్వామి కుర్చీ తెచ్చాడు. "రండి" అంది ప్రభావతి. ఇద్దరూ చెరోకుర్చీలోను కూర్చున్నారు. బలరామ్ కెమెరా రెండుమాట్లుతిప్పి Remove చేశాడు.

"చాలా బాగుంటుందండీ ఫోటో."

ప్రభావతి లోపలికెళ్లింది.

బలరామ్‌కీ నవ్వాగలేదు. ప్రసాదరావుకీ నవ్వాగలేదు.

౫

"ప్రభా!"

"ఏమండీ."

"ఎందాకా వొచ్చింది యింగ్లీషుచదువు?"

"పెద్ద పెద్ద పంక్తులు చదివేస్తున్నా."

"అబ్బో యింకేం. అయితే యిదిగో నీకు Present క్రొత్త Magazine."

ఆనందంతో చూచింది ప్రభావతి.

మొదటే వాళ్ల ఫోటో ఉంది. పేపర్లోలాగే. కించిత్ పరిజ్ఞానంతో యిలా చదువుకుంది.

Neo Magazine
Mr. & Mrs. Editors
Prabhavathi and Prasada Rao.

నవ్వుతున్న కళ్లతో చూచి అంది భర్తతో

"ఎంతటివారండీ."

"ఏమనుకున్నావు. రేపు బెజవాడలో

చెయ్యాలిది."

"అవును పుస్తకాల్లో 'అమ్మలక్కలు' కాదూ?"

"ఎంతటిదానివే."

630